క్లుప్తంగా

అమరవీరుడు పున్నారావుకు ఘన నివాళి



పున్నారావు కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న అధికారులు, విద్యార్థులు

పిఠాపురం: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పిఠాపురానికి చెందిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ తోట పున్నారావుకు అధికారులు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. 2014 ఏప్రిల్ 7న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలి తోట పున్నారావు మరణించారు. అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఆయనకు నివాళులర్పించాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎంఈఓ ఆర్‌వీ ప్రసాద్, ఎస్సై మురళి, ఏఎస్‌ఐ పి.రమేష్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు, స్థానికులు, పున్నారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



వేసవి శిబిరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మూర్తి తదితరులు

పెద్దాపురం: చిన్న వయసు నుంచే అన్ని విద్యలు నేర్చుకునేందుకు పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో మే 7వ తేదీ నుంచి నిర్వహించే వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంఎస్‌సీ మూర్తి, మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం అడ్మిన్ నరేష్ పెదిరెడ్డి, మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి రాజేష్‌కుమార్ దేవత అన్నారు. స్థానిక వరహాలయ్య పేట యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరం వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షులు కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ చిన్నారులు అన్ని విద్యలపై దృష్టి సారించి ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు దేశభక్తి భావాలను పెంపొందించుకోవాలన్నారు. శిబిరం కో-ఆర్డినేటర్ కూనిరెడ్డి అరుణ మాట్లాడుతూ విద్యార్థులు 94417 09187, 79016 97939 నెంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. పీసీసీ కార్యదర్శి రొంగల అరుణ్, గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్, యూటీఎఫ్ మండల కార్యదర్శి కెనడి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీ పట్నంలో సత్యసాయి పూజలు



ఆర్బీ పట్నం సత్యసాయి బాబా ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పెద్దాపురం: మండలంలోని ఆర్బీ పట్నంలో సత్యసాయి మందిరం వద్ద 78వ నయామి సాయి శత రుద్రీయాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వేదాధ్యయన సమన్వయ కర్త ఠాగూర్ హరిప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో యజ్ఞాలు వేదపఠనం, ఏకాదశ రుద్రాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తుమ్మలపల్లి జోగేంద్రనాథ్, జయబాబు, గోవిందరాజు, వి.విశ్వేశ్వరావు, పర్వత వర్ధన్‌రావు, నాగతారావు, బుల్లిరాజు తదితరలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక భజన సంకీర్తనలు నిర్వహించారు.

శ్రీ ప్రకాష్‌లో ఆకట్టుకున్న హరివిల్లు

ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు అపూర్వ స్పందన



పెద్దాపురం శ్రీప్రకాష్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ఆర్ట్ ఎగ్జిబిషన్

పెద్దాపురం: స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో నిర్వహిస్తున్న 'హరివిల్లు' కార్యక్రమం చూపరులను అకట్టుకుంది. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థులచే ప్రదర్శించిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు అపూర్వ స్పందన లభించింది. కాకినాడ, సామర్లకోట, పెద్దాపురం పట్టణాలకు చెందిన ఆయా పాఠశాలల విద్యార్థులు ఎగ్జిబిషన్ తిలకించి చిన్నారులు చేసినట్టు కాకుండా ప్రొఫెషనల్స్ చేసినట్లుగా ఉందంటూ పలువురు ప్రసంశించారు. ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రదర్శించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, ప్రొఫెసర్ సంతానం అభినందించారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

- వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- ఉప్పాడలో ఎన్నికల ప్రచారం

కొత్తపల్లి: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలో అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. మండలంలోని ఉప్పాడలో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల కోసం తమ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందించిందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా అవ్వాతాతలు, దివ్యాంగులకు నేరుగా ఇంటికే పింఛన్లు అందేవన్నారు. ప్రతిపక్ష నేతలు ప్రభుత్వంపై అక్కసుతో ఇంటింటికీ పింఛన్ల పంపిణీని అడ్డుకున్నారన్నారు. అనంతరం అమీనాబాద్‌లో పోలేరమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో



అమీనాబాద్‌లో పోలేరమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

మండలంలోని ఇసుకపల్లి గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఆదివారం ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీ చేరారు. వైఎస్సార్ సీపీ నాయకులు యరకం వెంకటదివాకర్‌రెడ్డి, యరకం నూకరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత కండువాలు వేసి పార్టీలోకి అహ్వానించారు.

ప్రభుత్వ పథకాలతో ప్రజలకు మేలు

- వైఎస్సార్ సీపీ అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, దవులూరి దొరబాబు
- 28, 30వ వార్డులలో విస్తృత ప్రచారం

సామర్లకోట: సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు జరుగుతుందని వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. ఆదివారం 28, 29, 30 వార్డులలో వార్డు కౌన్సిలర్లు రెడ్నం సునీత, కరణం రాజ్‌కుమార్, చల్లపల్లి వెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో వారు ఎన్నికల ప్రచారం చేశారు. గణపతినగరం వాటర్ ట్యాంకుల వద్ద యువకులు సీహెచ్ గంగాధర్, సీహెచ్ భానుప్రసాద్, ఎ.లోకేష్, ఎస్.మణికుంత, డి.దుర్గ, కె.గోవిందు, ఎం.తేజ, కుమార్ పార్టీలో చేరారు. వారికి సునీల్, దొరబాబు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. దాంతో ఎన్నికల ప్రచారం హోరెత్తింది. ఈ సందర్భంగా సునీల్, దొరబాబు మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా ఆదుకోవడా నికి సీఎం జగన్ నవరత్న పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పేదలకు చేరువగా ఉండే వలంటీర్లపై టీడీపీ నాయకులు కక్ష పెంచుకున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఎంపీ అభ్యర్థికి ఒకటి, ఎమ్మెల్యే అభ్యర్థికి ఒకటి ఓట్లు వేయాలని వారు ఇంటింట ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు ఊబా జాన్ మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్,



సామర్లకోట 28వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు సునీల్, దొరబాబు

మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు వైఎస్సార్ సీపీలో చేరిక

స్థానిక 29వ వార్డుకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు అమలకంటి బాబీ ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు 29వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఆ వార్డు కౌన్సిలర్ కరణం రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డు కౌన్సిలర్ రెడ్నం సునీత, పార్టీ పట్టణ



వైఎస్సార్ సీపీలో చేరిన అమలకంటి బాబీతో సునీల్, దొరబాబు తదితరులు

అధ్యక్షుడు మద్దాలి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీరు అందక రైతుల ఆందోళన



సాగునీరు అందక ఎండిపోయే స్థితిలో వీకే రాయపురం పంటపొలాలు



వరి మళ్లలో నీరు లేక బీటలు వేసే స్థితిలో పొలాలు

- ఇరిగేషన్ డీఈ నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం

సామర్లకోట: సాగునీరు అందించవలసిన ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో చేతికి అందే పంట ఎండి పోయే ప్రమాదం ఉన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి కాలువ, ఏలేరు కాలువ చెంతనే ఉన్నా వీకే రాయపురంలో రైతుల సాగు నీటి ఎద్దడిని ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. దాంతో పంట పొలా లు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతు సంఘ నాయకులు తలారి దొరబాబు, ఇంటి వెంకట్రావు, వెలమర్తి బుల్లిరాజు, వెలమర్తి శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ డీఈ నిర్లక్ష్యం వల్లే సాగునీరు అందడం లేదని వారు ఆరోపిస్తున్నారు. వర్షాలు వస్తున్నపుడు నీటి నిల్వ చేయకుండా వృథాగా సముద్రంలోకి విడిచిపెడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఎంఏఓ ఐ సత్యను వివరణ కోరగా ఈ సమస్యపై జిల్లా అధికారులకు వివరించామని, వరి నాట్లు ఆలస్యంగా కావడంతో ప్రస్తుతం ఆ ప్రాంతంలో పంట పొలాలకు నీటి అవసరం ఎక్కువగా ఉన్నదని ఆమె చెప్పారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న సచివాలయ కార్యదర్శి రాధాకృష్ణ

పెద్దాపురం: ప్రస్తుత ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రతీ నెలా పింఛన్ అందజేసే వలంటీర్లు ఎన్నికల కమిషన్ పక్కన పెట్టడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సచివాలయ సిబ్బంది ఆ సేవలను కొనసాగిస్తున్నారు. దీనిలో భాగంగా పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామానికి చెందిన దిమ్మల వీరబుల్లి పిఠాపురం సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆదివారం నేరుగా తన సొంత ఖర్చుతో సచివాలయ కార్యదర్శి ఎల్.రాధాకృష్ణ, డిజిటల్ అసిస్టెంట్ దివాకర్ సీఎంసీకి చేరుకుని పింఛన్ అందజేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీరబుల్లితో పాటు ఆమె చెల్లెలు పొట్లకాయల మరియమ్మలకు పింఛను అందజేసిన సచివాలయ సిబ్బంది సేవలను పలువురు అభినందించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో స్వామివారు

గొల్లప్రోలు: మండలంలో దుర్గాడ శివాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, చెరుకూరి దత్తు ఆధ్వర్యంలో స్వామివారికి మహన్యాస పారాయణ, 11 రుద్రాలు, 21 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేసి స్వామివారికి సప్త హారతులు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎన్నికల శిక్షణ ఏర్పాట్ల పరిశీలన

కాకినాడ: రానున్న ఎన్నికల నేపథ్యంలో విధి నిర్వహణలో ఉండే ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు 12, 13 తేదీలలో జరగనున్న శిక్షణ ఏర్పాట్లను సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ఆదివారం పరిశీలించారు. శిక్షణ జరిగే పీఆర్ కళాశాల ప్రాంగణాన్ని అధికారులతో కలిసి సందర్శించిన ఆయన చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, తహసీల్దార్ దొర, ఇతర ఎన్నికల అధికారులు ఉన్నారు.

వైభవంగా పోలేరమ్మతల్లి తీర్థం



ప్రత్యేక అలంకరణలో నూకాలమ్మ తల్లి



పందులమ్మతల్లి



దున్నపోతుతో తొక్కించుకునేందుకు సాష్టాంగ పడిన భక్తులు

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాద్‌లో పోలేరమ్మతల్లి తీర్థ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. శనివారం రాత్రి అమ్మవారి జాతర నిర్వహించారు. ఈ జాతరలో పూర్వం నుంచి ఓ వింత ఆచారం కొనసాగుతోంది. దున్నపోతును తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి ఉపవాసం ఉన్న భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరగనృత్యాల నడుమ దున్నపోతును గ్రామమంతా ఊరేగించి ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఉపవాసం ఉన్న భక్తులందరూ పసుపునీళ్లతో స్నానం చేసి అమ్మవారి ఆలయం ఎదురుగా బారులుతీరి పడుకున్నారు. పడుకున్న వారిమీదుగా దున్నపోతును నడిపించారు. అలా మూడు పర్యాయాలు భక్తులు దున్నపోతుతో తొక్కించుకున్నారు. ఇలా దున్నపోతు తొక్కడం వల్ల గ్రామానికి ఉన్న అరిష్టం పోవడంతో పాటు ప్రజల కష్టాలు తీరుతాయని భక్తుల నమ్మకం. అనంతరం ఆలయంలో అమ్మవారికి పసుపు, కుంకుమలతో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. గరగ నృత్యాలతో గ్రామం మార్మోగింది. గతంలో ఈ దున్నపోతును బలి ఇచ్చేవారు. ప్రస్తుతం పూజల అనంతరం దున్నపోతును విడిచిపెట్టారు. మండలంలో నలుమూలల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి వింత ఆచారాన్ని తిలకించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



పోలేరమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు



గరగల నృత్యాలు

నూకాలమ్మతల్లి జాతర

కొత్తపల్లి: మండలంలో యండపల్లిలో వేంచేసిన నూకాలమ్మ తల్లి జాతరను ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. గ్రామంలో గరగ నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు గరగలను దర్శించుకున్నారు. జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని రంగులు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. సోమవారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా పందులమ్మతల్లి తీర్థం

కొత్తపల్లి: మండలంలో మూలపేటలో వేంచేసిన పందులమ్మతల్లి తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నూకాలమ్మతల్లి జాతర ప్రారంభం

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లోని నూకాలమ్మ ఆలయంలో ఆదివారం జాతర ఉత్సవాలను ప్రారంభించారు. గ్రామదేవతైన్న ఈ అమ్మవారికి నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. కొత్త అమావాస్యను పురస్కరించుకుని ఉత్సవాలు నిర్వహిస్తారు. అమ్మవారిని బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించి గరగ నృత్యాల నడుమ జాతర ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య, కమిటీ సభ్యులు భక్తులకు సేవలందించారు. సోమవారం అమావాస్యను పురస్కరించుకుని స్థానిక శెట్టిబలిజ పేటలో ఉత్సవం నిర్వహిస్తారు.

ఘనంగా నూకాలమ్మ జాతర

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- భక్తి శ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు కాండ్రకోట నూకాలమ్మ తల్లి జాతర మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గవరసాని వీరాస్వామి, ఆలయ కార్యనిర్వహణాధికారి తలాటం వెంకట సూర్యనారాయణ, ఉత్సవ ప్రత్యేకాధికారి సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో భారీ ఉత్సవాన్ని నిర్వహించారు. జాతర ఉత్సవాన్ని ఆలయ లాంఛనాలతో గ్రామానికి చెందిన గంటా వారి కుటుంబం నుంచి గరగను తీసుకువచ్చి అమ్మవారి జాతరను వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వీరాస్వామి, ఈఓ సూర్యనారాయణ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరం అన్నారు. యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు సీఐ రవికుమార్, ఎస్ఐ వెలుగుల సురేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ వద్ద కోలాటం, గరగల నృత్యం, మ్యూజికల్ నైట్, దేవతామూర్తుల వేషధారణ, కాళీ కావేషాలు, భారీ విద్యుత్ అలంకరణల మధ్య మహోత్సవం అంబరాన్నంటింది. పిన్న, పెద్ద తేడా లేకుండా వేల సంఖ్యల్లో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కాండ్రకోట నూకాలమ్మ తల్లి

ఏలేరులో మృతదేహం లభ్యం

పెద్దాపురం: మండలంలోని చంద్రమాంపల్లి ఏలేరు కాలువలో గ్రామంలో పేపర్‌గ్లాసులు ఏరుకునే రమణ (55) అనే అనాథ మృతదేహం లభ్యమైందని ఎస్ఐ వెలుగుల సురేష్ తెలిపారు. పంచాయతీ అధికారుల సమాచారం మేరకు అధికారులు, గ్రామ సర్పంచ్‌ల సమక్షంలో అనాథ శవాన్ని పంచాయతీ సిబ్బంది ఖననం చేసినట్లు తెలిపారు.

9 మంది జూదరుల అరెస్టు

మండలంలోని కట్టమూరు శివారు తోటల్లో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 9 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ముమ్మరంగా వరి కోతలు

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా రబీ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే 50 శాతం కోతలు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మండలంలో ఈ ఏడాది సుమారు 10154 ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. ప్రస్తుతం పంట పక్వానికి చేరడంతో కోతలు ప్రారంభించారు. ఎక్కువ మంది రైతులు మెషీన్లతో కోతలు కోసేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జోగిరాజు సూచించారు.



కొత్తపల్లిలో మెషీన్‌తో వరికోతలు



కోసిన ధాన్యాన్ని ట్రాక్టర్‌పై వేస్తున్న మెషీన్



ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న కూలీలు



ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిప్పులు చెరుగుతున్న భానుడు



నిర్మానుష్యంగా ఉన్న సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి

సామర్లకోట: ఈ ఏడాది వేసవి మండిస్తోంది. ఆదివారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. ఉదయం 8 గంటల నుంచి భానుడు రగిలిపోతున్నాడు. సాయంత్రం ఆరు అయినా ఎండ వేడి తగ్గక పోవడంతో పాటు వేడి గాలులు వీస్తున్నాయి. దాంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరైపోతున్నారు. ఎన్నికల సీజన్ కావడంతో పలు పార్టీల శ్రేణులు ప్రచారాలకు బయటకు రావాలంటే హడలిపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యల వల్ల విద్యుత్ కోతలు లేకపోవడం ప్రజలకు కొంత ఉపశమనం కలిగిస్తోంది. స్టేషన్ సెంటర్‌లోని మున్సిపల్ షాపులలోకి నేరుగా ఎండ వస్తుండడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు తగు జాగ్రత్తలు తీసుకుంటే కానీ బయటకు రావడం లేదు. నిత్యం రద్దీగా ఉండే స్టేషన్ సెంటర్, ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రాక పోకలు స్తంభించిపోయాయి. జూన్ 5 వరకు ఎండ తీవ్రత ఉంటుందని అధికారులు హెచ్చరిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా శీతల పానీయాలకు తీవ్ర డిమాండ్ ఏర్పడింది. తలకు టోపీ, తలపాగా, గొడుగు వంటి రక్షణ చర్యలు తీసుకోకుండా బయటకు రావద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు.